# తేడా

-మిత్రా



సత్రున థియేటర్ ముందుకి వచ్చి, ఆగింది హీరో హోండా. దానిమీద నుంచి మరింత విలాసంగా దిగాడు సాయికృష్ణ.

చుట్టూ ఓసారి చూసి, జేబులోంచి కర్చీఫ్ తీసి, నుతారంగా ముఖం అద్దుకున్నాడు. ఎండకొంచెం ఎక్కువగానే ఉంది.

తరువాత, హోండాని స్టాండ్‌లోపెట్టి, టోకెన్ తీసుకున్నాడు. సినిమా ప్రారంభమయ్యేందుకు ఇంకా పావుగంట టైం ఉంది. సినిమా కొంచెం పాతది రెండో సారిరిలీజ్ కావడంతో జనం పెద్దగా లేరు.

కౌంటర్‌లోకి వెళ్ళి టిక్కెట్ తీసుకున్నాడు తెల్సిన వాళ్ళు ఎవరూ లేకపోవడంతో, ఇక లోపలికి వెళ్ళిపోదామను కుని వెళ్ళాడు.

లోపల కూడా జనం ఎక్కువమంది లేరు. ఒక వరుసలో సీటు చూసుకుని, వెళ్ళికూర్చున్నాడు. అదే వరుసలో మిగిలిన సీట్లు ఖాళీగానే ఉన్నాయి.

అప్పటికి ఇంకా ఫ్యాన్లు వేయలేదు.

"ఈ ఫ్యాన్లు వేస్తే ఏం పోయిందో, అసలే ఉక్కగా ఉంది." అనుకున్నాడు.



మరోసారి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. ఇంకొక రెండు నిమిషాలు గడిచాయి: అయినా ఫ్యాన్‌లు వేయలేదు.

"రాస్కెల్స్!" అని మళ్ళీ తిట్టుకున్నాడు ఆ విధంగా ఓ అయిదు నిమిషాలు గడిచాయి.

అప్పుడే ఆ హాల్లోకి ప్రవేశించాడు ఓ వ్యక్తి. చూస్తే బాగా పల్లెటూరి మనిషిలాగా ఉన్నాడు. ప్రక్కనే పెళ్ళాం, ఇద్దరు చిన్న పిల్లలూ, పెద్దగా మాట్లాడుకుంటున్నారు.

"యూజ్‌లెస్ ఫెలోస్" అంటూ వాళ్ళని కాస్సేపు తిట్టుకున్నాడు సాయికృష్ణ. సఫారీడ్రస్ అసలే ఉక్క! పైగా ఫ్యాన్లు వేయలేదు! ఆ చికాకుని వాళ్ళ మీదికి చూపించాడు అతడు.

ఈలోగా ఆ పల్లెటూరివ్యక్తి అక్కడంతా పరిశీలనగా చూశాడు. సాయికృష్ణ పక్కనే ఉన్న సీట్లు అతన్ని ఆకర్షించాయేమో.

వెంటనే ఆయన సాయికృష్ణ ప్రక్కన కూర్చుని, తన పక్కన పెళ్ళాం పిల్లలల్నీ కూర్చోబెట్టుకున్నాడు. వాళ్ళని చూస్తూంటే, వాళ్ళకి బాల్కనీ క్లాసుకి రావడం అది మొదటిసారని స్పష్టంగా తెలుస్తోంది. పిల్లలు కుషన్ సీట్లలో ఎగిరెగిరి కూర్చుంటు న్నారు.

"వీళ్ళకి బాల్కనీ ఎందుకో" అని విసుగ్గా అనుకున్నాడు సాయికృష్ణ.

రెండు నిమిషాలయ్యాక, ఇక వాళ్ళ ప్రక్కన కూర్చోవడం ఇష్టం లేనట్లుగా లేచి, ఇంకో సీట్లోకి వెళ్ళి పోయాడు.

ఆ పల్లెటూరి మనిషికి కూడా చెమటపడ్తున్నట్లుగా అన్పించి, ఓసారిపైకి చూశాడు. ఫ్యాన్లు లేవు. తిరగడం లేదు.

అతడొక్క క్షణం ఊరుకుని, "ఇప్పుడే వస్తా" అని లేచి క్రిందకి వెళ్ళాడు. రెండు నిముషాల్లో గేట్‌కీపర్‌తో తిరిగి వచ్చాడు.

"ఈ స్విచ్‌లు వేసి, ఈ మెయిన్ పైకి లాగితే సరిపోయేదిగదా!" అంటూ ఫ్యాన్ స్విచ్ ఆన్‌చేశాడు గేట్ కీపర్.

"మాకు తెలీదు కదయ్యా!" అన్నాడు ఆ పల్లెటూరి అతడు.

"అదేలే, ఇంకా జనం నిండలేదని నేనుకూడా వేయలేదు" అంటూ, కిందకి వెళ్ళిపోయాడు గేటు కీపరు. ఆ పల్లెటూరి మనిషి తన సీటు వైపు కదిలాడు.

అప్పటికే ఫ్యాన్లు 'చల్లగా' తిరగడం మొదలెట్టాయి! సాయికృష్ణ ముఖం నల్లగా మాడిపోయింది.

మిత్ర
8/275-3, గొడుగుపేట,
మచిలీపట్నం - 521 001.